క్లుప్తంగా

నేడు 'డయల్ యువర్ డీఎం'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమాన్ని నేడు సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఎం.శివప్రసాద్ గురువారం తెలిపారు. ఆర్టీసీ అభివృద్ధి కోసం ప్రజలు, ప్రయాణికులు తమ సలహాలు, సూచనలు 85003 24880 నంబర్‌కు ఫోన్ చేసి చెప్పవచ్చని తెలిపారు.

స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాలకు ఎంపికలు



కొత్తగూడ: హైదరాబాద్‌లోని హకీంపేట స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం మండల కేంద్రంలోని స్పోర్ట్స్ స్కూల్‌లో ఎంపిక పోటీలను గురువారం చేపట్టారు. ఈసందర్భంగా క్రీడలను ప్రారంభించిన అనంతరం హెచ్‌ఎం తోలెం దేవదాస్ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీడీలు చుంచ కొమ్మాలు, వెంకన్న, విజయలలిత, మాధవి, ప్రవీణ్, సీఆర్పీలు ఉపేందర్, గిరిబాబు, తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మహబూబాబాద్ రూరల్: ఓ యువకుడు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మహబూబాబాద్ రూరల్ పోలీసులు గురువారం బాధితుడికి అప్పగించారు. మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శనిగపురం గ్రామానికి చెందిన చిట్టిమల్ల శ్రీమన్ నాలుగు రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు ఫోన్ ఆచూకీ కనుగొని బాధితుడికి రూరల్ ఎస్సై దీపికరెడ్డి అప్పగించారు.

జీపీ కార్యదర్శిని విధుల్లోకి తీసుకోవాలి



కురవి: మండలంలోని బలపాల గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పని చేసిన రమేష్‌కు న్యాయం చేయాలని తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు మాలోత్ కిషన్ నాయక్ డిమాండ్ చేశాడు. గురువారం మండల కేంద్రంలో సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంచర్‌లోని ప్లాట్లకు ఇంటి నంబర్లు కేటాయించారనే ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్‌చేశారని తెలిపారు. రమేష్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బానోత్ దేవానాయక్, ముని, గుగులోత్ హేమ్లానాయక్, వెంకన్న నాయక్ పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలి



నెహ్రూసెంటర్: విభజన చట్టంలో ఉన్న హామీ మేరకు బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడే శంతన్ రామరాజు అన్నారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ ఏర్పాటు ఉద్యమ కేసులో భాగంగా గురువారం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీలు పరిశ్రమ స్థాపనకు కృషి చేయాలన్నారు. ఉద్యమాల్లో పాల్గొన్న నాయకులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలన్నారు.

ఉప్పరిగూడెంలో ఘనంగా బోనాలు



కురవి: సీరోలు మండలం ఉప్పరిగూడెం గ్రామంలో గురువారం ముదిరాజ్ కులస్తుల ఆరాధ్యదైవం పెద్దమ్మ తల్లికి బోనాలను సమర్పించారు. అమ్మవారి ఆలయం చుట్టు ప్రదక్షిణలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్నారు.

వామ్మో జూన్..!

- ఇటు పంటల సాగు.. అటు పిల్లల చదువు
- అన్ని ఖర్చులు ఒకేసారి రావడంతో ప్రజల సతమతం

పెద్దవంగర: పేద మధ్య తరగతి కుటుంబాల్లో ఖర్చుల గుబులు నెలకొంది. పదకొండు నెలల పాటు నెట్టుకొచ్చిన ఆయా కుటుంబాలు జూన్ మాసం వచ్చిందంటే చాలు ఆందోళన చెందుతున్నారు. నెలరోజులపాటు వేసవి సెలవులను ఆటపాటలతో గడిపిన విద్యార్థులు పుస్తకాలతో కుస్తీ పట్టేందుకు వెళ్తుండగా వారి తల్లిదండ్రులు పొలంబాట పట్టారు. గ్రామీణ ప్రాంతంలో ఎక్కువగా వ్యవసాయ ఆధారిత కుటుంబాలు కావడంతో రైతులు మాత్రం ఆర్థిక ఇబ్బందులను అధికమించేందుకు ఆలోచనలో పడ్డారు. వేతనంపైన ఆధారపడినవారు సైతం ఈనెల కష్టకాలమనే చెప్పాలి. ఏడాదంతా ఆదా చేసిన సొమ్మంతా ఈనెలల్లోనే హరించుకుపోతుంది.

విద్యా సంస్థల ఫీజుల మోత..

జూన్ రెండోవారం నుంచి పాఠశాలలు మొదలయ్యాయి. దీనికి తోడు ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది కూరగాయలు, కిరాణం సరకుల ధరలు పెరిగాయి. పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించేందుకు రూ.15వేల నుంచి రూ.25వేల వరకు ఖర్చు అవుతోంది. అడ్మిషన్ ఫీజు, స్కూల్ ఫీజు, యూనిఫాం, బూట్లు పుస్తకాలు, బస్ ఫీజులతో విద్యాసంస్థల్లో ఫీజుల మోత తప్పడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీలు వేసి వసతులు కల్పించినప్పటికీ సరైన విద్య అందడంలేదనే భావనతో తల్లిదండ్రులు ఎంత కష్టమైన తమ పిల్లలకు మంచి విద్యను అందించాలనే సంకల్పంతో ప్రైవేట్‌కు మొగ్గు చూపుతున్నారు. మరి కొంత మంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ తోటి వారు ఏమనుకుంటారో.. అనే భావనతో ప్రైవేట్ పాఠశాలలకు పంపించి అవస్థలు పడుతున్నారు.

పంటల సాగుకు పెట్టుబడులు..

మండల వ్యాప్తంగా ఎక్కువ మంది వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. రైతులు ఖరీఫ్ సాగు పనులు ఈనెలలో ప్రారంభించారు. విత్తనం ఎరువుల ఖర్చులు కూడా అధికంగా ఉన్నాయి. కొంత మంది రైతులు పత్తివిత్తనాలు విత్తుకోగా కొందరు నారుమడులు సిద్ధం చేసుకొని నారు పోశారు. పెట్టుబడులకు వడ్డీలు తెస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకం కింద రూ.2వేలు రైతుల ఖాతాల్లో జమ అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న రైతుబంధు సాయం అందలేదు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం ఖరీఫ్ సాగులో ఎకరాకు రూ.5వేలు అందిస్తుంది. కాగా రైతులు ఈసాయం కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. పిల్లల చదువులు, వ్యవసాయ ఖర్చులు అంచనా వేయలేక పేద, మధ్యతరగతి కుటుంబాలవారు తలలు పట్టుకుట్టున్నారు.



సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు



పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న విద్యార్థులు

పేదల భూముల్లో ప్లాంటేషనా?



ఫారెస్టు అధికారులను అడ్డుకుంటున్న రైతులు

గూడూరు: ప్రతీ సంవత్సరం ఇదే గొడవా.. పేదల పోడు సాగు భూముల్లోనే ప్లాంటేషన్ పెడతారా.. గత సంవత్సరం మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్ చెబితే వెనక్కి వెళ్లారు కదా.. మళ్లీ ఎందుకు వస్తున్నారని హరిజన పోడు సాగు రైతులు మందుల సారయ్య, లక్ష్మయ్య, శివ అన్నారు. మండలంలోని బొల్లెపల్లి శివారు వాయిల్ బంధం సమీపంలోని మానుకోట ఫారెస్టు రేంజ్ పరిధిలో పోడు భూములను గురువారం ఎఫ్‌ఆర్వో జ్యోత్స్నదేవి సిబ్బందితో వచ్చి పరిశీలిస్తున్నారు. విషయం తెల్సుకున్న బొల్లెపల్లి శివారు ఎస్సీ కాలనీకి చెందిన హరిజన రైతులు అధికారులతో గొడవకు దిగారు. అందుకు ఎఫ్‌ఆర్వో మీ వద్ద ఏమైనా హక్కు పత్రాలు ఉంటే చూపండి, చూసి వెళ్లి పోతా, కానీ మావే అంటే వదిలేది లేదన్నారు. మాకు పైఅధికారుల నుంచి ఒత్తిడి ఉందన్నారు. దీంతో రైతు మందుల సారయ్య పత్రాలు ఉన్నాయనగా, ఎఫ్‌ఆర్వో వెనక్కి తగ్గి, పత్రాలతో రేపు ఆఫీసుకు వచ్చి చూపమని, లేకుంటే భూమిని వదిలేదిలేదంటూ వెళ్లారు.

ఉపాధ్యాయులకు సన్మానం



గార్ల: సన్మానిస్తున్న హెచ్‌ఎం



దంతాలపల్లిలో..

గార్ల: మండలంలోని గోపాలపురం హైస్కూల్లో ఇటీవల జరిగిన పదోన్నతుల్లో భాగంగా బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను పాఠశాల హెచ్‌ఎం ఎం.రామచంద్రు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాజేశ్వరి, వీరన్న, వీరస్వామి, రాజశేఖర్‌రావు, కిషన్, మాన్‌సింగ్, సుజాత, ఎంపీటీసీ రాజకుమారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు పాల్గొన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉపాధ్యాయులకు అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పదోన్నతులపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి పులిచింతల విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి ఎనుమాల శ్రీనివాస్, వేణుగోపాల్, కాంత్రికుమార్, జింకల వెంకట నర్సయ్య పాల్గొన్నారు.

హెచ్‌సీయూ వీసీని తొలగించాలి



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

మహబూబాబాద్ అర్బన్: బీజేపీ కార్యకర్తగా వ్యవహరిస్తున్న హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ వీసీని తొలగించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని మదర్ థెరిసా సెంటర్ లో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వీసీ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈసందర్భంగా మధు మాట్లాడుతూ.. హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీలో వీసీ గెస్ట్ హౌస్ ముందు స్టూడెంట్స్ యూనియన్ హక్కుల కోసం నిరసన తెలిపిన స్టూడెంట్స్ యూనియన్ నాయకులను క్యాంపస్ నుంచి సస్పెండ్ చేయడం సిగ్గుచేటన్నారు. ప్రజాస్వామ్యవాదులందరు తీవ్రంగా ఖండించి జరగబోయే ఉద్యమానికి మద్దతు తెలపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనింగ్ కమిటీ సభ్యులు గుగులోత్ సూర్య ప్రకాశ్, గంధసిరి జ్యోతిబసు, బానోత్ సింహాద్రి, గుండ్ల రాకేష్, రాజేష్, మహేష్, నవీన్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మరిపెడ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగు 1, ఇంగ్లీష్ 1, అర్థశాస్త్రం 1, వాణిజ్యశాస్త్రం 2, కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్ 1 సబ్జెక్టులకు సంబంధించి పీజీలో ఓసీ, బీసీలకు 55శాతం, ఎస్టీ, ఎస్సీలకు 50శాతం మార్కులు కలిగి ఉండాలన్నారు. నీట్, సెట్, స్లేట్, పీహెచ్‌డీతోపాటు బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తులను జూలై2 మంగళవారం సాయంత్రం 4.30 గంటల లోపు కళాశాలలో సమర్పించాలన్నారు. జూలై 8న అభ్యర్థులు ఉదయం 10.30గంటలకు మహబూబాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (నూకల రామచంద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల)లో జరిగే ఇంటర్వ్యూకు హాజరుకావాలని ఆమె కోరారు.

సమగ్ర వేతన చట్టం తేవాలి



డీటీకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గూడూరు: దేశవ్యాప్తంగా వ్యవసాయ రంగం మీద ఆధారపడిన కూలీలకు సమగ్రవేతన చట్టం తీసుకు రావాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) మహబూబాబాద్ డివిజన్ నాయకుడు వీరెల్లి మల్లేష్, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు పెద్దకాసు కోరుమల్లు అన్నారు. మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయం ఎదుట గురువారం వారు మాట్లాడుతూ.. 14మందికి పైగా ఉన్న వ్యవసాయ కూలీలకు మెరుగైన వేతన చట్టం కావాలని ఎన్నో పోరాటాలు చేసిన గత పాలకులు పట్టించుకోలేదన్నారు. అనంతరం డీటీ కోమలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు అద్దూరి బ్రహ్మచారి, ఎర్రబెల్లి రాజు, వెంకటయ్య, వీరన్న, వెంకన్న, కిరణ్, భద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: అప్పుగా తీసుకున్న డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేయడంతో ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామ శివారులో గల రాళ్లవాగు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గూడూరు మండలంలోని దామరవంచ గ్రామానికి చెందిన గండ్రపల్లి నరేష్ గ్రామంలోని సత్తిరెడ్డి అనే వ్యక్తి వద్ద పనిచేస్తున్నాడు. నరేష్ తన అవసరాల నిమిత్తం యజమాని వద్ద కొంత డబ్బును అప్పుగా తీసుకున్నాడు. యజమాని నరేష్‌ను డబ్బులు ఇవ్వాలని ఒత్తిడికి గురిచేయడంతో మనస్తాపంతో మహబూబాబాద్ చేరుకున్నాడు. ఈ క్రమంలో ఈదులపూసపల్లి గ్రామ శివారులో గల రాళ్లవాగు సమీపంలో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయాన్ని తన మిత్రుడు సుదర్శన్‌కు ఫోన్ చేసి చెప్పి వెంటనే సెల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకున్నాడు. బాధితుడి భార్య లలితకు సమాచారం చేరవేయడంతో ఆమె మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సెల్ ఫోన్ చివరి కాల్ లొకేషన్ ఆధారంగా పోలీసులు ఘటనాస్థలాన్ని గుర్తించారు. అక్కడికి చేరుకున్నారు. బాధితుడిని ఆస్పత్రికి తరలించారు. నరేష్ భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

వీఎస్ లక్ష్మీపురంలో ఇసుక డంప్ సీజ్

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ రూరల్: అక్రమంగా ఇసుక నిల్వలు పేరిట 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన నేపథ్యంలో రెవెన్యూ అధికారులు, రూరల్ పోలీసులు స్పందించారు. ఇందులో భాగంగా గురువారం మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణప్రసాద్, రూరల్ ఎస్సై దీపికరెడ్డి మహబూబాబాద్ మండలంలోని వీఎస్ లక్ష్మీపురం గ్రామానికి వెళ్లి ఇసుక డంపును సీజ్ చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వ్యాపారులు స్థానిక చెరువుల్లో నుంచి అక్రమంగా సుమారు 15ట్రిప్పుల ఇసుకను తీసువచ్చి ఒకచోట నిల్వ ఉంచగా పంచనామా నిర్వహించి సీజ్ చేశామని రూరల్ ఎస్సై దీపికరెడ్డి తెలిపారు. సీజ్ చేసిన ఇసుకను ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణ పనులకు వినియోగిస్తామని తహసీల్దార్ భగవాన్ రెడ్డి పేర్కొన్నారు.



ఇసుక డంపులు సీజ్ చేసిన ఎస్సై దీపికరెడ్డి, ఆర్ఐ కృష్ణప్రసాద్

సంక్షిప్త సమాచారం

'రైతు భరోసా' వెంటనే విడుదల చేయాలి

మరిపెడ: రైతుభరోసా నిధులు వెంటనే విడుదల చేయాలని వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బానాల రాజన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. మరిపెడలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతు భరోసా నిధులు అందకపోవడంతో రైతులు ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను ఆశ్రయించాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

పెద్దవంగర: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ముదరబోయిన సోమయ్య (60) అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశాడు.

బియ్యం అందజేత

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె గ్రామంలో గ్రామానికి చెందిన కాటి వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈమేరకు గురువారం ఇంటికన్నె హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందజేశాడు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు నలమాస సందీప్, ఉపాధ్యక్షుడు ఎండీ షరీఫ్, ప్రధాన కార్యదర్శి బొల్ల హరీశ్, సహాయ కార్యదర్శి మల్లేష్, నరేష్, సంతోష్, సాయిరాం, శ్రీకాంత్, రామ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

3న మండల సభ

గూడూరు: మండల పరిషత్ కార్యాలయంలో జూలై 3వ తేదీ బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ వీరస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో మండల అభివృద్ధి అంశాలపై చర్చతోపాటు పదవీకాలం ముగియనున్న ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మాన కార్యక్రమం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి అన్నిశాఖల అధికారులతోపాటు ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

బాలయేసు దేవాలయం ప్రారంభం

గార్ల: గార్లలోని ఇందిరానగర్ సమీపంలో నూతనంగా నిర్మించిన బాలయేసు దేవాలయంను ఖమ్మం పీఠాధిపతి సగిలి ప్రకాశ్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో విశాఖపట్నం మండలాధిపతి బవిరి సురేష్‌బాబు, గార్ల చర్చి ఫాదర్ దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

పంట సాగుపై అవగాహన



కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం పత్తి, వరి, పసుపు, మిరప, మొక్కజొన్న పంటల సాగుపై మల్యాల కేవీకే శాస్త్రవేత్తలు ఎన్.కిశోర్, రాంబాబు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ మేఘన, కార్యదర్శి అరుణజ్యోతి, రైతులు పెరటి వెంకట్రామనర్సయ్య, గంట రామ్మోహన్ రెడ్డి, యాలాద్రి, పాల శ్రీనివాస్, గండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇసుక రవాణాను అరికట్టాలి

నెల్లికుదురు: మండల పరిధిలోని ఆకేరు వాగులోంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక రవాణాను అరికట్టాలని వాగు పరిధిలోని రైతు వెంకన్న బాధిత రైతులతో కలసి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇసుక తరలిస్తున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదన్నారు.

నివాళి

కురవి: దివ్యాంగుల ఉద్యమ సారథి హెలెన్ కెల్లర్ జయంతి వేడుకలను వికలాంగుల సంఘం రాష్ట్ర నాయకుడు సయ్యద్ ఖాజా ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం నిర్వహించారు. హెలెన్ కెల్లర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కర్నాటి మల్లికార్జున్, సీతయ్య, బత్తిని వెంకన్న పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు

గార్ల: గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రిలో నలుగురు మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చింత రమేష్ వెల్లడించారు. గురువారం గార్ల సీహెచ్‌సీ ఆసుపత్రిలో కుటుంబ నియంత్రణ క్యాంపు నిర్వహించారు. ప్రతి నెలలో ఒకరోజు క్యాంపు ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కురవి: సీరోలు మండలం కాంపల్లి గ్రామంలో గురువారం రూ.15లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ పెద్ది వెంకన్న, కొప్పుల వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

మరిపెడ: నర్సింహులపేట, దంతాలపల్లి, చిన్నగూడూరు, తొర్రూరు, పెద్దవంగర, మండలాల ధూప, దీప నైవేద్య సంఘం బాధ్యులుగా పాలంపల్లి రమణశర్మ, బొడ్డుపల్లి మహేష్‌కుమార్‌ను ఎన్నుకున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వెంకటేశ్వరచారి, శేఖర్, రఘురాం శర్మ, సాయి, శ్రీశర్మ, మధు, దేవేందర్, సాధు, నవీన్‌కుమార్, చంద్రశేఖర్, ఫణికుమార్, గీతచారి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు కలుషితం

దోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో తాగునీటిని సరఫరా చేస్తున్న పైపులైన్ లీకవడంతో తాగునీరు కలుషితమవుతోంది. గ్రామంలో జెడ్పీహెచ్ఎస్ ఎదురుగా భూమిలో మిషన్ భగీరథ పైపులు లీకవడంతో పైపుల నుంచి నీరంతా వృథాగా పోతోంది. పైపులు లీకైన ప్రాంతంలో నీటి నిల్వతో పెద్ద గుంత ఏర్పడింది. కుక్కలు గుంతలో సేద తీరుతుండడంతో నీరు కలుషితమై తిరిగి పైపుల ద్వారా సరఫరా అవుతుండటంతో తాగు నీరు కలుషితమవుతోంది. సంబంధిత సిబ్బంది స్పందించి పైపుల లీకేజీలకు మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బంకించంద్ర చటర్జీ జయంతి



మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని హోలీ వర్డ్స్ హైస్కూల్లో గురువారం వందేమాతర గేయ రచయిత బంకించంద్ర చటర్జీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్తేరు జయశ్రీ,, డైరెక్టర్ అనుదీప్, ఉపాధ్యాయులు రవి, ఉష, కృష్ణవేణి, హైమావతి, హసీనా, స్వరూప, మమత, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు మద్యం అమ్మకాలు

చిన్నగూడూరు: మండలంలోని ఆయా గ్రామాల్లో బెల్ట్ షాపులు గల్లికొకటి వెలసి జోరుగా బెల్టు దందా కొనసాగుతోంది. మద్యం విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. పగలు రాత్రి తేడా లేకుండా బెల్టు షాపులతో మద్యం ఏరులై పారుతోంది. వైన్ షాప్ యాజమానులు బెల్టు షాపులతో సిండికేట్‌గా మారి మూడు పువ్వులు ఆరు కాయలుగా వ్యాపారం కొనసాగుస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రోజంతా కష్టపడి కాస్త ఉపశమనం కోసం సామాన్యులు తాగే చీప్ లిక్కర్, యువత ఇష్టపడే చల్లటి బీర్లు వైన్ షాప్ నిర్వాహకులు బెల్టు షాపులకు ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో బెల్టషాపు వ్యాపారులు ఒక్కో బాటిల్‌పై రూ.50 అదనంగా అమ్ముతున్నారు. నూతన ఎక్సైజ్ మద్యం పాలసీని తీసుకువచ్చి ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా, కల్తీ మద్యాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టించుకోకపోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైన్ షాపులో దొరకని మద్యం బెల్ట్ షాపులో దొరుకుతుంటే ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మూసుకుపోయిన ఎస్సారెస్పీ కాల్వ



కాల్వకు అడ్డుగా ఉన్న మట్టి కట్ట

దోర్నకల్: మండలంలోని తొడేళ్లగూడెం గ్రామ సమీపంలో ఎస్సారెస్పీ కాల్వ మట్టి కట్టతోపాటు చెట్లు, ముళ్ల పొదలతో మూసుకుపోయింది. తొడేళ్లగూడెం–వెన్నారం మార్గంలో ఎస్సారెస్పీ కాల్వ కల్వర్టు సమీపంలో కాల్వకు అడ్డుగా గుర్తు తెలియని వ్యక్తులు మట్టిని అడ్డుగా పోసి కట్టను ఏర్పాటు చేశారు. రోడ్డుకు ఇవతలి పక్క కాల్వను ఆక్రమించి నీటి ప్రవాహాన్ని పక్కన వ్యవసాయ భూముల్లోకి మళ్లించేందుకు కొంతమంది వ్యక్తులు కాల్వకు అడ్డుగా మట్టి పోయించారని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. అడ్డుగా పోసిన మట్టి కట్టను తొలగించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

గంగారం: మండలంలో ఎవరైనా గుడుంబా తయారు చేసిన, అమ్మిన చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై రవికుమార్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పుట్టలభూపతి తండాలో విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. దాడుల్లో 150 చెక్కరపానకం డ్రమ్ములను ధ్వంసం చేశారు. గుడుంబా విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి



మహబూబాబాద్ రూరల్: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం గ్రామ శివారు రాంసింగ్ తండాలో గురువారం చోటు చేసుకుంది. తండాకు చెందిన రైతు బానోత్ సీతారాములు ఆవును మేత కోసం ఊరి శివారుకు తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై ఆవు మృతి చెందింది. మృతిచెందిన ఆవు విలువ రూ.80వేలు ఉంటుందని బాధితుడు విలపించాడు. ప్రభుత్వ ఆదుకోవాలని కోరాడు.